ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 18 ఆగస్టు 2025



ఎవరికీ పట్టని..

పెనుమూడి దిగువున కరకట్టకు ఆనుకునే తవ్వేసిన రొయ్యల చెరువులు



బాపట్ల రూరల్‌లో ముంపు బారిన పడిన వరిపైరు (ఫైల్ ఫొటో)

- జిల్లాలో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం
- వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబర్ హెచ్చరిక

వీడని.. వాన గండం



అల్పపీడన ప్రభావంతో ఆరెంజ్ అలర్ట్

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు..

నిజాంపట్నం(రేపల్లె): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో సముద్రంలో ఈదురుగాలులతో కూడిన భారీవర్షాలు పడనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసేందుకు మత్స్యకారులు ఎవరూ వెళ్లరాదని సూచించారు. వేట చేసుకునే మత్స్యకారులకు వాకీటాకీల ద్వారా తక్షణమే ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. వాయుగుండంతో ఈదురుగాలుతో కూడిన భారీ వర్షం అలల ఉధృతి పెరుగుతాయని పోర్టు అధికారులు తెలిపారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాను వాన గండం వీడటం లేదు. ఇటీవల దంచికొట్టిన వర్షాలకు పొలాలు చెరువులుగా మారి పైర్లన్నీ ముంపుబారిన పడిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 16,325 హెక్టార్లలో పైర్లు ముంపుబారిన పడినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా తేల్చింది. ఇందులో వరి వాటానే 16,197 హెక్టార్లుగా ఉంది. పొలాల్లో నిలిచిన నీళ్ల బయటకు పంపడానికి రైతులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు కాల్వలను తవ్వుకోగా.. మరికొందరు ఇంజన్లతో నీటిని బయటకు పంపి పైర్లను కాపాడుకున్నారు. దీంతో ఆదివారానికి కొంతమేర పైర్లు బయటపడ్డాయి. ఇంతలోనే మరో వాన గండం రైతులను వణికిస్తోంది. అల్పపీడన ప్రభావంతో సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఇటీవల కురిసిన ఎడతెరిపి వర్షాలకే ఉక్కిరిబిక్కిరయిన రైతులు మళ్లీ వర్ష ప్రకటనతో ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే కుళ్లిపోయిన పైర్లు

మూడు రోజులు నీళ్లలోనే ఉండడంతో వరిపైరు పూర్తిగా కుళ్లిపోయిందని రైతులు చెబుతున్నారు. వెద పద్ధతిలో సాగు చేశా మని ఎకరాకు రూ.7,000 నుంచి రూ.10,000 వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయని అంతా కూడా వర్షార్పణ మేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, వేమూరు, చుండూరు, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె, నగరం మండలాల పరిధిలోని 69 గ్రామాలపై ఇటీవల కురిసిన వర్షాలు తీవ్రప్రభావం చూపించాయి. కాల్వలు, డ్రెయిన్లలో పూడికతీత తీయకపోవడంతో చేలన్నీ ముంపులో చిక్కుకున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సాగులో దాదాపు 60 శాతం నష్టపోయినట్లేనని, మళ్లీ వానల హెచ్చరికతో వందశాతం నష్టం తప్పకపోవచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.



మున్నంగి-వల్లభాపురం మధ్య నదివైపున సగానికి కుంగిన కరకట్ట

కరకట్ట

- వరదల సమయంలో హడావుడితో సరి
- దారుణంగా ఉన్నా ఊసేలేని మరమ్మతులు
- ఆక్రమణలతో కాలిబాటను తలపిస్తున్న కరకట్ట
- మళ్లీ వరద ముప్పుతో కట్ట పటిష్ఠతపై భయాందోళనలు

రేపల్లె, తెనాలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ తీరంలోని గ్రామాలకు రక్షణ కవచం లాంటి కుడి కరకట్ట ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు.. ఎక్కడ గండిపడుతుందో ఏగ్రామాలను ముంచేస్తుందోనని ఆందోళనలో ప్రజలు ఉన్నారు. పది అడుగుల వెడల్పు ఉండాల్సిన కట్ట కొన్ని ప్రాంతాల్లో కాలిబాటను తలపించేలా చిక్కిపోయింది. సంవత్సరం క్రితం వచ్చిన వరద సమయంలో రాత్రి, పగలు విరామం లేకుండా మంత్రులు సైతం కరకట్టపై కాపలాకాశారంటే పరిస్థితి అర్థమవుతుంది. ప్రస్తుతం నదిలో నీటి ఉధృతి తక్కువగా ఉన్నా, వరుస వాయుగుండాలు, ముంచెత్తుతున్న వర్షాలతో భయం మాత్రం వెంటాడుతూనే ఉంది. వరదలు వచ్చినప్పుడు నాలుగు మూటలు అడ్డువేయడంతో సరిపెడుతున్నారే కానీ పటిష్ఠతకు శాశ్వత పనులపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. కరకట్టను అనుకునే రొయ్యల చెరువులు తవ్వడం, కట్టల మట్టి తవ్వుకుని అమ్మేసుకుంటున్నా మామూళ్లు వసూలు చేసుకోవడానికి ఆర్సీ అధికారులు పరిమితమవుతున్నారు. దీంతో గుంటూరు జిల్లాలోని ప్రకాశం బ్యారేజి నుంచి బాపట్ల జిల్లా లంకెవానిదిబ్బ మధ్య 102 కిలోమీటర్ల పొడవున్న కరకట్ట పరిస్థితి దయనీయంగా మారింది. కరకట్ట 61 కి.మీటర్ల పొడవులో గుంటూరు, బాపట్ల జిల్లాల కింద 8 కి.మీటర్ల పొడవున దెబ్బతిన్నది. పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు 38 కి.మీటర్ల పొడవున కేవలం మట్టి పనితో కరకట్ట వదిలేశారు. పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టకు నదివైపునున్న భూముల్లో రొయ్యల చెరువులు తవ్వేశారు. పెనుమూడి దగ్గర ఆర్సీ కార్యాలయాల దగ్గర్లోనే నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపినా వాటిని అడ్డుకునే వారే లేరు. రాజుకాల్వ-లంకెవానిదిబ్బ మధ్య రెండు నుంచి నాలుగడుగుల వెడల్పు కూడా లేదు. దీంతో ఇప్పుడు వరద వస్తే ఒక్కచోట కాకుండా ఎన్నిచోట్ల గండ్లు పడతాయోనన్న భయం తీరవాసులకు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. గత ఏడాది కృష్ణా నదికి దశాబ్దాల కాలంలో రానంతటి వరద రికార్డు స్థాయిని నమోదు చేసుకుంది. ఆ సమయంలో తాడేపల్లి మండలంలోని విజయవాడ క్లబ్ దగ్గర, ప్రాతూరు-వల్లభాపురం మధ్య కరకట్ట రోడ్డు దారుణంగా మారింది. మొత్తం కుంగిపోయి, ప్రమాదకరస్థితికి చేరింది. వల్లభాపురం వార్ఫ్ దగ్గర మూడడుగుల లోతుకు 300 మీటర్ల పొడవున కుంగిపోయింది.



పెదపులివర్రు-పెనుమూడి మధ్య దారుణంగా మారిన కరకట్ట

పొంచి ఉన్న ముప్పు..

గత ఏడాది వరదల సమయంలో దోనేపూడి, పెదపులివర్రు, పెనుమూడి మధ్య రెండు మూడు ప్రాంతాల్లో కరకట్టపై నుంచి నీరు బ్యాంక్ కెనాల్‌లోకి చొచ్చుకు వస్తుండటంతో ఇసుక మూటలు అడ్డువేసి అడ్డుకున్నారు. దీంతో అప్పటికి గండం గడిచింది. అయితే ఇప్పుడు అదే ప్రాంతాల్లో మళ్లీ భయం కలిగిస్తున్నది. ఎగువన వర్షాలతో పాటు జలాశయాల నుంచి వరద నీరు కిందికి వస్తోంది. దీంతో ఎప్పుడు ఎంత వరద వస్తుందో, ఏ స్థాయిలో విరుచుకుపడుతుందో అర్థంకాని విధంగా నదిలో పరిస్థితి మారింది. కనీసం కట్ట బలహీనంగా ఉన్నచోట ఇప్పుడైనా ముందస్తుగా ఇసుక మూటలు అడ్డువేసి రక్షణ ఏర్పాటు చేస్తారా అంటే అసలు ఆ శాఖ అధికారులే కనిపించని పరిస్థితి.

మామూళ్లతో పర్యవేక్షణ గాలికి

కరకట్ట పటిష్ఠత విషయంలో పర్యవేక్షించాల్సిన ఆర్సీ అధికారులు ఆ బాధ్యతలను గాలికొదిలేశారు. బ్రిటీష్ హయాంలో కరకట్టపైకి మనిషి కూడా వెళ్లడానికి వీలులేనంత కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేశారు. అయితే ఇప్పుడు ఏకంగా కట్టనే తవ్వుకుపోతున్నా పట్టించుకునే వారే లేరు. ఆర్సీ విభాగానికి సంబంధించి ప్రస్తుతం ఏఈలు కాదుకదా కనీసం వారి సహాయకులు కూడా కనిపించరు. పెనుమూడి దిగువున రొయ్యల చెరువులు, మట్టి తవ్వకందారుల దగ్గర మామూళ్ల వసూలు చేసుకోవడానికి అధికారులు పరిమితమవుతున్నారు. గత వైసీపీ హయాంలో ఇసుక దందాకు అడ్డు రాకుండా చేసేందుకు నదీపరివాహక ప్రాంతంపై అజమాయిషీ ఉండాల్సిన ఆ శాఖనే నిర్వీర్యం చేశారు. వైసీపీ సర్కారు పోయి, కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారు గాడిన పడలేదు. రేపల్లె మండలంలో కరకట్ట పరిస్థితి ఎలా ఉంది? ఎక్కడెక్కడ మరమ్మతులు చెయ్యాలనేది తెలుసుకునేందుకు ఆర్సీ అధికారుల కోసం తహసీల్దారు, ఇతర శాఖల అధికారులు ప్రయత్నిస్తే ఎవరూ అందుబాటులో లేని పరిస్థితి.

పుస్తకాల నిషేధం.. నిరంకుశ చర్య
● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

వాటర్ బాటిల్ కోసం గొంతు కోశాడు

ప్రకాశం బ్యారేజికి పెరిగిన వరద ఉధృతి

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి
జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత శంకర్ నాయక్

బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమిస్తాం
ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్


7

ఆక్రమణల తొలగింపు సాధ్యమేనా?



ఆక్రమణలు పోను మిగిలిన ఊరచెరువు

- హైకోర్టు ఉత్తర్వులతో అధికారుల ఉలికిపాటు
- ఊరచెరువులోని ఎన్టీఆర్ కాలనీవాసులకు నోటీసులు



అద్దంకి ఊరచెరువులో నిర్మాణాలు జరిగిన ఎన్‌టీఆర్ నగర్

అద్దంకి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల నుంచి అద్దంకి పట్టణంలో అంతర్గాగంగా ఉన్న ఊరచెరువు ఆక్రమణలకు గురైంది. ఇక్కడ ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీ కూడా వెలిసింది. ప్రస్తుతం 20 వ వార్డు పరిధిలో ఉన్న ఎన్‌టీఆర్ నగర్‌లో సుమారు 500 కు పైగా పేద, మధ్య తరగతి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే ఈ ఊరచెరువు రక్షణపై హైకోర్టు స్పందించి ఆక్రమణలను తొలగించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో చెరువులో ఇళ్ల నిర్మించుకుని ఉన్న కుటుంబాలను ఖాళీ చేయించడం అధికారులకు సవాల్‌గా మారింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే ఇబ్బందులు వస్తాయని అధికారులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి లో లక్ష్మీనరసింహస్వామి వారి తెప్పోత్సవం గతంలో ఊరచెరువులోనే నిర్వహించేవారని పెద్దలు చెప్తుంటారు. అంతటి వైభవం ఉన్న ఊరచెరువు ప్రస్తుతం ఉనికిని కోల్పోయింది. ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని 95 సర్వే నెంబర్ లో 121.50 ఎకరాలలో ఊరచెరువులో నాలుగు దశాబ్దాల నుంచి ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఇలా చెరువుకు సంబంధించిన 50 ఎకరాల్లో ఎన్‌టీఆర్ నగర్ విస్తరించింది. ప్రభుత్వ పరంగా ఇక్కడ నివసించే వారి కోసం మౌలిక వసతుల కల్పన కూడా జరిగింది. పలు గృహాలకు మున్సిపాలిటీ పన్నులు కూడా కట్టించుకుంటున్నది. కొందరికి ఇళ్ల స్థలాల పట్టాలను కూడా అధికారులు మంజూరు చేశారు. లైలా తుఫాన్ సమయంలో ఎన్‌టీఆర్‌నగర్ పూర్తిగా ముంపునకు గురైంది. అయినా ఆక్రమణలు ఆగలేదు. మొక్కుబడి చర్యలు మినహా అధికారులు పెద్దగా స్పందించలేదు. ఊరచెరువుకు నీరు చేరే వాగులను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేశారు. దీంతో ఊరచెరువు ఉనికి కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దామావారిపాలేనికి చెందిన కొందరు రైతులు ఊరచెరువులో ఆక్రమణలపై హైకోర్టును ఆశ్రయించారు. ఆక్రమణల తొలగింపుపై రెండేళ్ల క్రితం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు తిరిగి హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. దీంతో ఆక్రమణలు తొలగించమని ఇటీవల హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. చెరువులో నివాసం ఉంటున్న కుటుంబాలకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లను ఖాళీ చేయాల్సి రావడంతో కాలనీవాసులను కలవరపాటుకు గురిచేసింది. ఈ పరిస్థితుల్లో అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సి ఉంది.

అమ్మవారికి గాజుల అలంకారం



శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని 25 వేల గాజులతో అలంకరించారు. రంగు రంగుల గాజులతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

-అద్దంకి, ఆంధ్రజ్యోతి



గుంటూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

యాప్‌ల మోత.. రికార్డుల భారం.. పనిచేయని మొబైల్స్‌తో విధుల నిర్వహణపై అంగన్వాడీలు బెంబేలెత్తిపోతున్నారు. అమ్మో అంగన్వాడీ ఉద్యోగమా అంటూ పలువురు విముఖత చూపుతున్నారు. తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉద్యోగమంటేనే భయపడే పరిస్థితి అంగన్వాడీల్లో నెలకొంది. తాము పనిచేయలేమంటూ ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల మొబైల్ ఫోన్లను అధికారులకు పలువురు సరండర్ చేశారు.

- యాప్‌లు, రికార్డుల నిర్వహణతో బెంబేలు
- లక్ష్యాలకు దూరంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ
- రికార్డుల నిర్వహణ రద్దు జీవో వచ్చినా తప్పని భారం
- పనిచేయని ఫోన్లతో సతమతం.. అధికారులకు సరెండర్



వేమూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,295 కేంద్రాల ద్వారా 3 లక్షలమంది గర్భిణులు, బాలింతలు, లక్షన్నర మంది చిన్నారులకు పోషణ అందించడంతోపాటు, వారి సంక్షేమం విషయంలో అంగన్వాడీలది కీలకపాత్ర. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారాన్ని అందించడంతోపాటు, చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు (మిగతా 7లో)

పనిచేయని ఫోన్లు.. తలనొప్పిగా యాప్‌లు

అంగన్వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. వీటితోపాటు నెలకు రెండు సార్లు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒకసారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. అయితే సరుకులన్నీ ఒకేసారి రాకపోవడంతో వాటిని వేరు వేరు సమయాల్లో యాప్‌లో నమోదు చేయాల్సి వస్తోంది. టేక్ హోమ్ కిట్లలో ఇచ్చే సరుకులు మొత్తం ఒకేసారి రాకపోవడంతో గర్భిణులు, బాలింతలు పలుమార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనికితోడు ఎప్పుడో పాతకాలం నుంచి వాడుతున్న మొబైల్స్ పనిచేయకపోవడం, యాప్‌లకు సపోర్టు చేయకపోవడం వంటి కారణంగా యాప్‌ల నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారింది. ఆ కారణంగా లబ్ధిదారులు ఒకటికి పది సార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొందరైతే వదిలేసుకుంటున్నారు. అలా వారి విరాలు నమోదు కాక పోతే మరుసటి నెల నుంచి సరుకుల సరఫరా ఆగిపోతోంది. ఆ కారణంగా మరుసటి నెల సరుకుల కొరత వచ్చి లబ్ధిదారుల ఆగ్రహానికి అంగన్వాడీలు గురవుతున్నారు. చివరకు లబ్ధిదారుల ఆగ్రహావేశాలతో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారు.



మట్టి పరీక్షలు మమ

- భూసార పరీక్షలపై నిర్లక్ష్యం
- పరీక్షల లక్ష్యం 60,100.. పూర్తి 31,598
- భూ ఆరోగ్య కార్డుల పంపిణీ అరకొరగానే

రైతులకు ఎంతో ఉపయోగపడే.. భూసారం తెలియజేసే.. పంటల సాగుకు సద్వినియోగమయ్యే.. దిగుబడులు పెంచే మట్టి పరీక్షలపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతుల పొలాల్లోని మట్టి సేకరించి పరీక్షలు చేసి భూసారాన్ని నిర్ధారించి రైతులకు భూ ఆరోగ్య కార్డులు ఇవ్వాలి. తదనుగుణంగా రైతులు పోషకాల వినియోగంతో పాటు ఏ పంటలు సాగు చేయాలో నిర్ధారించుకుంటారు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వ్యవసాయశాఖ మట్టి పరీక్షల విషయంలో స్పందించడంలేదు. సిబ్బంది.. పరీక్షలకు అవసరమైన పరికరాల కొరత పేరుతో మట్టి సేకరణ.. పరీక్షల నిర్వహణ.. ఆరోగ్య కార్డుల పంపిణీ తూతూమంత్రంగా చేస్తోంది. పంటల సాగుకు ముందే అందించాల్సిన భూసార కార్డులు ముద్రణ స్థాయిలోనే ఉన్నాయంటే రైతులకు సంబంధించిన విషయాల్లో అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పంట సాగు పూర్తయ్యేలోపైనా రైతులకు ఆరోగ్య కార్డులు అందించే పరిస్థితులు కనిపించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(చీరాల, ఆంధ్ర జ్యోతి)

నేలలో సూక్ష్మపోషకాలు ఏ వెూతాదులో ఉన్నాయో గుర్తించి.. ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు వ్యవసాయశాఖ తెలియజేయాలి. ఇందుకు భూసార పరీక్షలు కీలకం. అయితే ఖరీఫ్ సాగు ప్రారంభమై వారాలు గడుస్తున్నా నేటికీ భూసార పరీక్షలు పూర్తి కాలేదంటే వీటిపై వ్యవసాయ శాఖకు ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మట్టి పరీక్షల లక్ష్యం 60,100 కాగా ఇప్పటికి 31,598 మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన భూసార పత్రాలను అందించడంలో కూడా అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. సాగు ప్రారంభం కాక మునుపే రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు (మిగతా 7లో)



ముద్రణలోనే కార్డులు

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా 23,043 సేకరించారు. వీటిలో 14,077 నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో లక్ష్యం మేర 13,862 మట్టి నమూనాలను సేకరించినా 7,455 పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,801 నమూనాలను సేకరించగా 10,066 పరీక్షలు పూర్తయ్యాయి. ఆయా కార్డుల పంపిణీ ముద్రణ స్థాయిలోనే ఉంది.

గేట్-2026



దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'గేట్-2026' షెడ్యూల్ వెలువడింది. మొత్తం 30 సబ్జెక్టు పేపర్లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఎంట్రెన్స్‌ను గౌహతి ఐఐటీ నిర్వహిస్తోంది. ఎంట్రెన్స్‌లో సాధించిన స్కోరు, ఫలితం వెలువడిన నాటి నుంచి మూడు సంవత్సరాలపాటు వాలీడ్‌గా ఉంటుంది. ఆ స్కోరుతో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ తీసుకోవచ్చు.

- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 25
- **ఎంట్రెన్స్ తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15
- **ఫలితాలు:** 2026 మార్చి 19
- **వెబ్‌సైట్:** http://gate2026.iitg.ac.in/

ఎలా ప్రిపేర్ కావాలి

జాతీయ స్థాయిలో అత్యంత పోటీ ఉన్న ఎంట్రెన్స్‌ల్లో 'గేట్' ఒకటి. అభ్యర్థుల టెక్నికల్ నాలెడ్జ్‌కి ప్రామాణికంగా ఈ ఎంట్రెన్స్‌ను భావిస్తుంటారు. గేట్ అత్యంత ప్రామాణికంగా ఉండడానికి కారణం దీనిని ఐఐటీలు నిర్వహించడమే. గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగం చేస్తూ చాలా మంది గేట్ ఎంట్రెన్స్ రాస్తుంటారు. ప్రశ్నలపరంగా చూస్తే ఇందులో మల్టిపుల్ చాయిస్, న్యూమరికల్ తరహా ఆన్సర్, జనరల్ రిలేటెడ్ ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ఇంజనీరింగ్ కాన్సెప్టులు, అనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ ఎబిలిటీస్ పరీక్షిస్తారు. గేట్ స్కోరుతో ఉన్నత చదువులే కాకుండా ఇతర అవకాశాలు కూడా ఉంటాయి.

ప్లానింగ్: గేట్ ప్రిపరేషన్ మొదలుపెట్టే ముందే ప్రస్తుత వర్క్ షెడ్యూల్‌ను పరిశీలించుకోవాలి. రోజువారీ పనులకు పోనూ ప్రిపరేషన్‌కు ఎంత సమయం కేటాయించగలం అనేది అంచనా వేసుకోవాలి. సిలబస్‌ను ముందు పెట్టుకుని సరైన పద్ధతిలో విభజించుకుని, వీక్లీ, మంత్లీ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు ఈ వారం నెలలో పూర్తి చేయాల్సిన చాప్టర్లు, లేదా సబ్జెక్టులు అని ప్లాన్ చేసుకోవాలి.

సరైన స్టడీ మెటీరియల్: అభ్యర్థి తాను రాసే ఇంజనీరింగ్ సబ్జెక్టుకు సంబంధించి సరైన మెటీరియల్‌ను ఎంచుకోవాలి. దీనికి సంబంధించి కోచింగ్ సెంటర్ల మెటీరియల్ ఉంటుంది. అలాగే చాలా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. గూగుల్‌లో సెర్చ్ చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయి.

మొబైల్ యాప్స్, ఆన్‌లైన్ మెటీరియల్: గేట్ అకాడమి, టెస్ట్ బుక్, గ్రేడ్‌అప్, తదితర యాప్స్‌లో స్టడీమెటీరియల్ అందుబాటులో ఉంటుంది. అలాగే మాక్‌టెస్టులు, ప్రాక్టీస్ ప్రశ్నలు లభిస్తాయి.

మాక్‌టెస్టులు: రోజు థియరీ చదవడం, ప్రశ్నలు పూరించడం చేయడంతో ప్రిపరేషన్ పూర్తయినట్లు కాదు. గత సంవత్సర ప్రశ్నపత్రాలు, మాక్ టెస్టులు రాయడం వల్ల టైమ్ మేనేజ్‌మెంట్‌తోపాటు బలహీనంగా ఉన్న చాప్టర్లను గుర్తించడం సులువు అవుతుంది. తరవాత తప్పులను పరిశీలించుకుంటే ఎక్కడ మెరుగు పరుచుకోవాలో అర్థం అవుతుంది. మాక్ టెస్టులు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మోటివేషన్: ప్రిపరేషన్‌లో మోటివేషన్ ఉండాలంటే ఇప్పటి వరకు ఎంత సిలబస్ పూర్తి చేశారు అనేది పరిశీలించుకుంటూ ఉండాలి. రోజువారీ, నెలవారీ లక్ష్యాలను ఎలా అందుకున్నది చూసుకుంటే మరింత ఉత్సాహం కలుగుతుంది. మాక్‌టెస్టుల్లో లభించిన స్కోరుతో లక్ష్యాన్ని ఎంత వరకు చేరుకున్నామో అర్థం అవుతుంది. అలాగే మంచి స్టడీ గ్రూప్‌లో చేరడం, లేదా ప్రిపేర్ అయ్యే వ్యక్తులతో కలిసి చదువు సాగిస్తే మోటివేషన్ లభిస్తుంది.

అకడమిక్ అవకాశాలు

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ తరవాత విద్యార్థులకు పలు అవకాశాలు ఉంటాయి. అందులో పాపులర్ ఆప్షన్ మాత్రం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్.

ఇంజనీరింగ్ పీజీ

- **మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్)/ మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ):** కాల పరిమితి రెండేళ్లు. ఈ కోర్సు చేయడానికి బీటెక్/బీఈతోపాటు గేట్ స్కోరు ఉండాలి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలతోపాటు బిట్స్ పిలానీ, డీటీయూ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, అన్నా వర్సిటీ మొదైనవి ఉన్నాయి.

స్పెషలైజేషన్లు: సీఎస్ఈ, ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్, పవర్ సిస్టమ్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, థెర్మల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ మొదలైనవి.

- **మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్సీ)/ ఎంఎస్(రీసెర్చ్):** ఐఐఎస్సీ, ఐఐటీ, కొన్ని యూనివర్సిటీలు వీటిని అందిస్తున్నాయి. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఇది సరైన కోర్సు. గేట్ లేదా ఆయా సంస్థలు పెట్టుకునే పరీక్షల ద్వారా అడ్మిషన్ లభిస్తుంది.

ఇతర అవకాశాలు

- **పబ్లిక్ సెక్టార్లో ఉద్యోగాలు:** ఓఎన్‌జీసీ, బీహెచ్ఈఎల్, ఐఓసీ, గెయిల్, డీఆర్‌డీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజస్‌లు తమ టెక్నికల్ విభాగాల్లో నేరుగా 'గేట్' ర్యాంకర్లకు ఉద్యోగాలు ఇస్తారు.
- **అంతర్జాతీయ అవకాశాలు:** 'గేట్'లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుంది. అలాగే విదేశీ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్(ఎన్‌యూఎస్), ఈటీహెచ్ జ్యూరిచ్ తదితర విద్యా సంస్థలు 'గేట్' స్కోరును అంగీకరిస్తాయి.
- **ఇండస్ట్రీ-అకడమిక్ గుర్తింపు:** ఇండస్ట్రీ, అకడమిక్ వైపు 'గేట్' స్కోరును సబ్జెక్ట్ ఎక్సలెన్స్‌కు బెంచ్ మార్కుగా భావిస్తారు.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

దిక్సూచి

స్కాలర్‌షిప్స్

దివ్యాంగ విద్యార్థులకు..

దివ్యాంగ విద్యార్థుల కోసం సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ ఉపకార వేతనాలు అందిస్తోంది. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గుర్తింపు పొందిన వైకల్యం ఉన్న విద్యార్థుల చదువుల కోసం 'స్కాలర్‌షిప్ ఫర్ డిజెబిలిటీస్'ను అందిస్తున్నారు. వీటిలో పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు, దేశీయ, విదేశీ చదువులు, పోటీ పరీక్షల శిక్షణ కోసం కూడా సహాయం చేస్తున్నారు.

స్కాలర్‌షిప్ రకాలు:

- **ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 9, 10 తరగతుల వారికి ఉద్దేశించింది.
- **పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్:** 11వ తరగతి నుంచి పీజీ, డిగ్రీ, డిప్లొమా వారికి ఉద్దేశించింది.
- **టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్:** ప్రముఖ విద్యా సంస్థల్లో యూజీ, పీజీ చదువులకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఫెలోషిప్:** భారతీయ యూనివర్సిటీల్లో ఎంఫిల్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది.
- **నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్:** విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీలకు ఉద్దేశించింది. అభ్యర్థులు దీనికి ఎంపికయ్యే సంవత్సరం ఏప్రిల్ 1 నాటికి 35 సంవత్సరాల లోపు ఉండాలి.
- **ఫ్రీ కోచింగ్ స్కాలర్‌సిప్:** ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోచింగ్‌లకు ఉద్దేశించింది.

అర్హత: 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ డిజెబిలిటీ ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వైకల్యానికి సంబంధించిన, యూడీఐడీ కార్డు ఉండాలి.

కుటుంబ ఆదాయం: రూ.2.5 లక్షలు(ప్రీ-పోస్ట్ మెట్రిక్ దరఖాస్తు దారులకు), రూ.8 లక్షలు(టాప్ క్లాస్, నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఫ్రీ కోచింగ్ దరఖాస్తు దారులకు), నేషనల్ ఫెలోషిప్ వారికి ఎలాంటి ఆదాయ పరిమితి లేదు. ఒకే తల్లిదండ్రుల నుంచి ఇద్దరు పిల్లలు మాత్రమే అర్హులు. కవలల విషయంలో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ధ్రువపత్రాలు: పాస్‌పోర్ట్ ఫోటో, బర్త్ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నెంబర్, ట్యూషన్ ఫీజు రసీదు, చివరి విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా వివరాలు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31 **వెబ్‌సైట్:** scholarships.gov.in

గిరిజన విద్యార్థులకు..

కేంద్ర గిరిజన గిరిజన వ్యవహార శాఖ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు 'జాతీయ స్కాలర్‌షిప్ పథకం' అందిస్తోంది. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, సైన్స్ టెక్నాలజీ, హ్యూమానిటీస్, లా, సోషల్ సైన్స్ వంటి విభాగాల్లో చదువుకు ఏడాదికి 2.50 లక్షలతోపాటు ఇతర ఆర్థిక సహాయం పొందవచ్చు.

స్కీమ్ పేరు: జాతీయ గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యా పథకం(టాప్ క్లాస్ స్కాలర్‌షిప్)

అర్హత: అభ్యర్థులు గిరిజన వర్గానికి చెందిన వారై ఉండాలి. మంత్రిత్వశాఖ ప్రకటించిన ప్రముఖ విద్యా సంస్థలో డిగ్రీ, పీజీలో ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఆరు లక్షల లోపు ఉండాలి. ఒకే కోర్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరో స్కాలర్‌షిప్ పొందుతూ ఉండరాదు.

ధ్రువపత్రాలు: గిరిజన సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అడ్మిషన్/ఫీజు రసీదు, ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ పాస్‌బుక్, అర్హత పరీక్ష సర్టిఫికెట్/మార్క్‌షీట్, బోనఫైడ్ సర్టిఫికెట్

దరఖాస్తు: ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్, అవసర పత్రాల్ అప్‌లోడ్ తరువాత మంత్రిత్వశాఖ ధ్రువీకరణ పొందాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

వెబ్‌సైట్: scholarships.gov.in



నౌకాదళంలో ఉద్యోగాలు

భారత నౌకాదళంలో గ్రూప్ 'సీ' నాన్ గెజిటెడ్, 1266 ఇండస్ట్రియల్ ట్రేడ్స్‌మెన్ స్కిల్డ్ ఖాళీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎక్స్‌నేవల్ అప్రెంటిస్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల లోపు ఉండాలి.

ట్రేడులు: సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంట్, మెషిన్ తదితరాలు.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 2

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో జనరలిస్ట్ ఆఫీసర్లు

మొత్తం పోస్టులు 500

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 500 జనరలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

విద్యార్హతలు: కనీసం 60 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ వారికి 55 శాతం చాలు. చార్టర్డ్ అకౌంటెంట్ ఉత్తీర్ణతతోపాటు, అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 22 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ

పరీక్ష విధానం: 150 మార్కులకు ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. ఇందులో 20 మార్కులు ఇంగ్లిష్, 20 మార్కులు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, 20 మార్కులు రీజనింగ్, 90 మార్కులు ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కి ఉంటాయి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **చివరి తేదీ:** 2025 ఆగస్ట్ 30

వెబ్‌సైట్: https://bankofmaharashtra.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

చిరు ప్రయత్నం ఫలించేనా?

- సమ్మె నేపథ్యంలో చిరంజీవిని కలసిన చిన్న నిర్మాతలు
- మెగాస్టార్ శుభవార్త చెబుతానన్నారు: నిర్మాత నట్టికుమార్
- నేడు ఫెడరేషన్‌తో చిరంజీవి చర్చలు?

తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన కార్మికుల వేతన పెంపు సమస్య తన పరిధిలో లేదనీ, దానిపై ఫిల్మ్ చాంబర్ నిర్ణయమే అంతిమం అని చిరంజీవి గతంలో సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే రెండు వారాలుగా టాలీవుడ్ కార్మికుల సమ్మె కొనసాగుతున్నా ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, నిర్మాతలు కానీ సమస్యకు పరిష్కారం సాధించలేకపోయారు. దీంతో టాలీవుడ్ పంచాయితీ మళ్లీ మెగాస్టార్ నివాసానికి చేరినట్లు ఆదివారం నాటి పరిణామాల నేపథ్యంలో తెలుస్తోంది. సయోధ్య కోసం కొందరు నిర్మాతలు ఆదివారం చిరంజీవిని ఆశ్రయించారు. ఇరువర్గాలతో సంప్రదింపులకు తాను సిద్ధమనీ, ఈ సమస్యకు తానో పరిష్కారం చూపుతానని చిరంజీవి అభయం ఇచ్చినట్లు నిర్మాతలు సి. కల్యాణ్, నట్టికుమార్ చెప్పారు. అదే నిజమైతే రెండు వారాలుగా కొనసాగుతోన్న సినీ కార్మికుల సమ్మె పరిష్కారం కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో మరో ముందడుగు పడి, కార్మికుల సమ్మెకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఇండస్ట్రీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అయితే సోమవారం చిరంజీవి ఫెడరేషన్‌తో చర్చలు జరుపుతారని నిర్మాత నట్టికుమార్ చెప్పిన మాటలపై కొందరు సంశయాన్ని వెలిబుచ్చుతున్నారు. గతంలో సమ్మె పరిష్కారం కోసం చిరంజీవి చొరవ చూపుతున్నారంటూ వచ్చిన వార్తలను ఆయన నిర్మొహమాటంగా ఖండించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అయితే నట్టికుమార్ మాట నిజమవుతుందా? చిరంజీవి శుభవార్త చెబుతారా? అనే ఆసక్తి మాత్రం ఇప్పుడు అంతటా నెలకొంది.



కార్మికులతో చిరంజీవి మాట్లాడతానన్నారు: సి. కల్యాణ్

టాలీవుడ్ కార్మికుల సమ్మె విషయంలో మొదట్నుంచి చిరంజీవి పేరు ప్రముఖంగా వినిపిస్తున్నా ఆయన మాత్రం బయట ఎక్కడా స్పందించింది లేదు. సమ్మె పరిష్కారం కోసం ఇండస్ట్రీలోని అగ్రనిర్మాతలంతా ఆదివారం చిరంజీవితో సమావేశమవుతారని శనివారం ఉధృతంగా ప్రచారం జరిగింది. ఏం జరిగిందో కానీ ఆదివారం అగ్ర నిర్మాతల్లో ఎవరూ చిరంజీవిని కలవలేదు. కానీ ఆదివారం ఉదయం నిర్మాత సి. కల్యాణ్ ఒక్కరే చిరంజీవిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'కార్మికుల సమ్మె సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు చిరంజీవి గారు ప్రతి రోజూ మాతో మాట్లాడుతున్నారు. త్వరలోనే ఈ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'ఒక పెద్దమనిషిగా ఇరు వర్గాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో చిరంజీవి ఉన్నారు, తనవంతుగా కార్మికులతో మాట్లాడతానన్నారు' అని తెలిపారు. 'చిన్న నిర్మాతలు బాగా ఇబ్బందులు పడుతున్నారు, నా అనుభవంతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ఆయనకు వివరించాను. ఫెడరేషన్ గతంలోనే నిర్మాతల ప్రతిపాదనలను అంగీకరించినా, వారి బలహీనతల వల్లే అవేవీ అమల్లోకి రాలేదు సినిమా షూటింగ్స్ అనేవి ఓ కుటుంబ వాతావరణంలో జరగాలి తప్ప, కార్మిక చట్టాల ప్రకారం సినిమాలకు పనిచేయించడం కుదరదు' అని కల్యాణ్ అన్నారు.

చిరంజీవి మాట వింటామని ఫెడరేషన్ చెప్పింది: నట్టికుమార్

ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం నిర్మాత నట్టి కుమార్ ఆధ్వర్యంలో పలువురు చిన్న నిర్మాతలు చిరంజీవిని కలిశారు. సినిమాల నిర్మాణంలో తాము ఎదుర్కొంటున్న కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నట్టికుమార్ మీడియాతో మాట్లాడుతూ 'ఫెడరేషన్‌తో సమావేశమై వారి వాదన కూడా వింటాననీ, త్వరలోనే శుభవార్త చెబుతానని చిరంజీవి చెప్పారు. చిన్న సినిమాలకు ఇబ్బందిరాకుండా చూడాలని మేం ఆయన్ని కోరాం. నిర్మాతల ఇబ్బందులను వివరించాం. మా ప్రతిపాదనలకు చిరంజీవి సానుకూలంగా స్పందించారు, పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. సోమవారం ఫెడరేషన్ నాయకులతో సమావేశమవుతానని చెప్పారు. 'చిరంజీవి ఏం చెబితే అది తూచా తప్పకుండా పాటిస్తామ'ని ఫెడరేషన్ చెప్పింది కాబట్టి ఈ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాను' అని నట్టికుమార్ తెలిపారు. అయితే సి. కల్యాణ్, నట్టికుమార్ వ్యాఖ్యలపై గానీ, జరుగుతున్న పరిణామాలపై గానీ ఇప్పటివరకూ ఫిల్మ్ ఛాంబర్ కానీ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కానీ స్పందించలేదు. మరి చిరంజీవి స్వయంగా పూనుకొని, ఈ సమస్యకు ఓ పరిష్కారం చూపుతారా, కార్మికులతో సమ్మెను విరమింజేస్తారా, లేదా అనేది వేచిచూడాలి.

పవన్.. రాజకీయ తుపాను



రజనీకాంత్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ హీరో పవన్ కల్యాణ్‌ను సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ తుపాన్‌గా అభివర్ణించారు. ఆ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ఆదివారం చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. తాజాగా రజనీకాంత్ 50 యేళ్ళ సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సంగతి తెల్సిందే. ఆ సందర్భంగా రజనీకాంత్‌కు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందేశానికి రజనీకాంత్ ప్రతిస్పందించారు. 'ఏపీ ఉప ముఖ్యమంత్రి, నా సోదరుడు, పొలిటికల్ సైక్లోన్ పవన్ కళ్యాణ్ గారు.. ప్రేమతో చెప్పిన విషెస్‌కు ఉప్పొంగిపోయా. మీ విషెస్‌ను ఓ గౌరవంగా భావిస్తున్నా. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని రజనీకాంత్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)


నిధి డబుల్ ధమాకా

'హరిహర వీరమల్లు' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు నిధి అగర్వాల్. ఆమె ప్రస్తుతం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు మారుతి ఈ హారర్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఆదివారం నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



మరో హారర్ థ్రిల్లర్‌లో నిధి

నిధి అగర్వాల్ మరో హారర్ థ్రిల్లర్ చిత్రంలో నటించనున్నారు. ఆమె పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ చిత్రాన్ని ప్రకటించి, ఆమె లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నిఖిల్‌కార్తీక్.ఎన్ దర్శకత్వంలో పుప్పాల అప్పలరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరాకు టైటిల్‌ను ప్రకటించనున్నారు.




క్రీడా నేపథ్యంలో..

విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. సిజా రోజ్ కథానాయిక. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా మేకర్స్ 'అర్జున్ చక్రవర్తి' టైటిల్ సాంగ్‌ని ఆవిష్కరించారు. విక్రాంత్ రుద్ర సాహిత్యానికి విఘ్నేష్ భాస్కరన్ స్వరాలు సమకూర్చారు. దీపక్ బ్లూ, సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ ఆలపించారు. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.



వినోదం ఖాయం

ఎన్.ఎన్.ఆర్.చౌదరి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'నేను... నా లల్లి'. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ "నేను నా లల్లి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ఆద్యంతం ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తడం ఖాయం. ఈ చిత్రంలో పాటలు కూడా రాశాను' అని చౌదరి తెలిపారు. కథానాయిక తస్లీమ్ మాట్లాడుతూ 'కుంటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పాత్ర నాది. చక్కటి సినిమా చూశామన్న అనుభూతి ప్రతి ఒక్కరికీ కలుగుతుంది' అని అన్నారు.



హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రల్లో సుకేష్ నాయక్ దర్శకుడిగా చారిత్రక నేపథ్యంతో తెరకెక్కుతోన్న చిత్రం 'హలగలి'. యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కల్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ధనంజయను ఓ యోధుడిగా పరిచయం చేస్తూ గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాలీ ధనంజయ మాట్లాడుతూ "నిర్మాత కల్యాణ్, డైరెక్టర్ సుకేశ్ చాలా ప్యాషన్‌తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. తప్పకుండా సినిమా ఒక మంచి అనుభూతిని ఇవ్వబోతుంది. అందరి అంచనాలను అందుకుంటుంది' అని అన్నారు.

ప్రకాశం బ్యారేజికి పెరిగిన వరద ఉధృతి


బ్యారేజి దిగువకు వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 2,85,392 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదు అయిందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.3 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా దిగువకు 2,82,358 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాల్వకు 2,518, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు వదులుతుండగా.. గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు.

జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా వాలీబాల్ జట్లు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో జరగనున్న అండర్ 15 బాల బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు.. జిల్లా జట్లను స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి ఆదివారం ప్రకటించారు. వేజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో.. ఎంపికలు నిర్వహించారు.

బాలుర జట్టు: ఎ.అరుణ్ కుమార్, డి.బ్రహ్మం (పెదకూరపాడు), వి.బాలాజీ నాయక్, ఎ.బాలు మహేంద్ర (గుంటూరు), కె.భువన సాయి (పెదకూరపాడు), ఎం.అజయ్ (తాడేపల్లి) స్టాండ్ బై లుగా వి.సోహెల్, పి.ఆల్విన్.

బాలికల జట్టు: ఎస్.సువర్ణ (పీబీ సిద్ధార్థ), ఎస్.నేహా (పెదకూరపాడు), జి.నాగూర్ బి, వై.నందిని, ఎ.నాగమల్లేశ్వరి (వేజెండ్ల), సీహెచ్ నవీన (మంగళగిరి) స్టాండ్ బైలుగా ఎ.దుర్గా లక్ష్మీ, వి.లక్ష్మీ రేణు (పెదకూరపాడు).

అంబటి ఆరోపణలు హాస్యాస్పదం

పొన్నూరుటౌన్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని చింతలపూడిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నూరు పొలాలు ఎప్పుడైన అంబటి చూశారా.. కనీసం దారులైనా తెలుసా అని ప్రశ్నించారు. కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణం కాంట్రాక్టర్ అంశంపై గత ప్రభుత్వ హయాంలో జరిగిందని, దానిని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం మూడు విడతలుగా నోటీసులు ఇచ్చిందని కాంట్రాక్టర్ అంశం మీద బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని.. అంబటి సిద్ధమా అని సవాల్ విసిరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయన శాఖను దిగ్విజయంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పంట పొలాల మునక ఫొటోలు గ్రాఫిక్స్ చూపి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. అమరావతి ముంపునకు గురికాకుండా ఆ నీటినే పొన్నూరుకు పంపారని రాజకీయ నిరుద్యోగులు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. అమరావతి మీద చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలను రెచ్చగొట్టే కుట్రతో అంబటి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమిస్తాం

ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమిస్తామని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ అన్నారు. ఆదివారం నరసరావు పేటలోని ఎస్‌టీయూ జిల్లా కార్యాలయంలో ముఖ్యుల సమావేశం జరి గింది.


సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ జోసఫ్ తదితరులు

సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి అధ్యక్షత వహిం చారు. జోసఫ్ సుధీర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను పాఠాలు బోధించకుండా తరగతికి దూరం చేయడమే ప్రభుత్వ విధానంలా కనిపిస్తోందన్నారు. మూల్యాంకనం కోసం కొత్తగా అసెస్మెంట్ బుక్‌లను ప్రవేశపెట్టారని, ఒక్కో ఉపాధ్యాయుడు మౌఖిక పరీక్షల విద్యార్థుల ప్రతిస్పందనలను వందలాది పేజీలు రాయాల్సి ఉంటుందన్నారు. ఒక ఉపాధ్యాయుడు ప్రైమరీ తరగతులకు బోధిస్తే 240 పేజీలు, ఉన్నత తరగతులకు బోధిస్తే 147 పేజీలు గరిష్ఠంగా విద్యార్థి ప్రతిస్పందనలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇన్ని పేజీలు నమోదు చేస్తుంటే ఉపాధ్యాయుడుకి బోధనకి ఎక్కడ సమయం ఉంటుందని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులు విద్యార్థులకు పరీక్షలు పెడుతున్నారా, ఉపాధ్యాయులకు పరీక్షలు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మోడల్ స్కూల్ పేరిట ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల మూలంగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలివెళ్లారన్నారు. ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం.సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.గంగాధర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకట కోటయ్య, సీహెచ్ అనిల్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏమండీ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల నిషేధం.. నిరంకుశ చర్య

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పలు పుస్తకాలను నిషేధిస్తూ.. ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎన్.భావన్నారా యణ అధ్యక్షతన ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, రాజ్యాంగ నిపుణులు ఏజీ నురానీ, విద్యావేత్త సుమంత్రా బోస్ వంటి పలువురు ప్రముఖులు రాసిన 25 పుస్తకాలను నిషేధించారని వివరించారు. కశ్మీర్ ప్రజల స్థితిగతులతో పాటు వారి మనోభావాలపై ఎన్నో పరిశీ లనలు, పరిశోధనలు చేసి అక్కడి వాస్తవ పరిస్థితులను పుస్తకాల రూ పంలో తెచ్చారని తెలిపారు. అటువంటి పుస్తకాల ప్రచురణ, కొను గోళ్లపై గవర్నర్ వేటు వేయడం ప్రజల స్వేచ్ఛాయుత హక్కులను పూ ర్తిగా హరించడమేనని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించకుండా.. ఇటువంటి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. పహల్గాంలో ఉగ్రవా దుల దాడుల పరిణామాల


ప్రసంగిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు తదితరులు

నేపథ్యంలో ప్రజల్లో విశ్వాసం కల్పించేం దుకు తగిన దిద్దుబాటు చర్యలు అవసరమన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె.జి.శంకర్, ప్రొఫెసర్ ఎన్. వేణుగో పాలరావు, వీవీకే సురేష్, నిర్బంధ వ్యతిరేక ఫోరం నాయకుడు కె.రవిచంద్ర, కాపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత శంకర్ నాయక్

వినుకొండటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత శంకర్ నాయక్ అన్నారు. వినుకొండ జాషువా కళా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా పోరాడాలన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలిపి ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, బీఎస్పీ కార్యదర్శి రాజు, జరపల కృష్ణా నాయక్, హనుమంతు నాయక్, రంగ నాయక్, విష్ణు నాయక్, బాలాజీ నాయక్, డాక్టర్ కోటేశ్వరరావు నాయక్, సైదా నాయక్, మాచర్ల జడ్పీటీసీ మల్లు సామి, సర్పంచ్ బ్రహ్మం, రాంజీ నాయక్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న గిరిజన నాయకులు

వరి, పత్తి సాగులో శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి

లాంఫాం(తాడికొండ)ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న వేళ వరి, పత్తి పంటలు వేసే రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. వెంకటరాములు, కోఆర్డినేటర్ ఎన్. వెంకట లక్ష్మి సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా వరి నారుమడి నీట మునిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పత్తి పంటను ఇంకా విత్తని రైతులకు పలు సూచనలు తెలియజేశారు. నారుమ డిలో లేదా ఆరు తడి వరి సాగు పొలాల్లో విత్తనం చల్లిన రెండు నుంచి మూడు రోజుల వయసులో మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. నారు విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీటిలో మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మునిగిన నారుమడి లో నుంచి ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలి మరియా ఒక గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజం మాంకో జెబ్ లను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. వరి పంట పిలకల దశలో మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేసుకో వాలని సూచించారు. పత్తి పంటను ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకేసారి విత్తుకున్నట్లయితే గులాబీ రంగు పురుగు సమస్యను తగ్గించవచ్చన్నారు.

వాటర్ బాటిల్ కోసం గొంతు కోశాడు

శావల్యాపురం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య చోటు చేసుకొన్న వాగ్వివాదం ముదిరి.. మరో వ్యక్తి గొంతుకోసిన ఘటన శావల్యాపురంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న షాపు వద్ద శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన వూట్ల శ్రీనివాసరావు ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి 11.30 సమయంలో వినుకొండలో పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తూ.. వాటర్ బాటిల్ కోసం శావల్యాపురం పీహెచ్‌సీ సమీపంలోని షాపు వద్ద ఆగాడు. అదే సమయంలో చిన్నకంచెర్లకు చెందిన పూరేటి గణేష్ కూడా వాటర్ బాటిల్ కోసం అక్కడికి వచ్చాడు. ఇద్దరూ తమకే ముందుగా వాటర్ బాటిల్ ఇవ్వాలని షాపు యజమానిని ఒత్తిడి చేశారు. అనంతరం ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. ఇద్దరూ కొట్లాడుకొనే సమయంలో గణేష్ పక్కనున్న ఉల్లిపాయలు తరిగే కత్తితో శ్రీనివాసరావు మెడపైన కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రుడు శ్రీనివాసరావును స్థానికులు వినుకొండలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ లోకేశ్వరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకొన్నారు. శ్రీనివాసరావును కుటుంబ సభ్యులు ఆదివారం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితుడు గణేష్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లమడ ఆధునికీకరణ చేపట్టాలి : కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు పేర్కొన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఆదివారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలు రాకపోవడం వల్ల నల్లమడ వాగులో పైనుంచి వచ్చే వర్షాల వల్ల ఈ ప్రాంత భూములు చౌడుబారి వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయన్నారు. 2019లోనే గుంటూరు చానెల్‌కు పరిపాలన అనుమతులు ఇచ్చినప్పటికీ భూ సేకరణ పూర్తికాలేదన్నారు. కానీ, ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించామని ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. నల్లమడ వాగు ఆధునికీకరణ చేపట్టకపోవడం వల్ల ఈ ప్రాంతంలో వరదలు వచ్చి ఏటా వేలాది ఎకరాలు పంటలు నీట మునిగి రైతులు నష్టాలు బారిన పడుతున్నారన్నారు. 2017లో రూ.360 కోట్లు ఆధునికీకరణకు పరిపాలన అనుమతులు లభించాయని దాని ప్రకారమే ఆధునీకరణ చేపట్టాలని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అకారణంగా మహిళా రైతులు, రైతులపై కేసులు బనాయించారని వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, గోవాడ సత్యనారాయణ, ఈదర భ్రమరాంబ, మన్నవ హరిప్రసాద్, జాష్టి వీరయ్యచౌదరి, కొల్లా నిర్మల, రామన్, మొవ్వా పెద్దన్న, వెలినేని సత్యనారాయణ, హనుమంతరావు, వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు

ఈ గుంతల చింత తీరేదెన్నడు?

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రెండు మండలాలను కలిపే రోడ్డు. గుంతల మయంగా మారింది. ఈ గుంతలను మట్టితో పూడుస్తారు. వర్షం వస్తే గుంతలలో వేసిన మట్టి, కంకర పక్కనే ఉన్న కాల్వలోకి, పొలాల్లోకి కొట్టుకుపోతుంది. దీనివల్ల గుంతలు యథాస్థితికి చేరి ఎప్పటి లాగే తటాకాలను తలపిస్తాయి. బాపట్ల మండలం గుడిపూడి గ్రామం నుంచి ఏట్రవారిపాలెం మీదగా కర్లపాలెం మండల కేంద్రానికి చేరుకునే రోడ్డు దుస్థితి ఇది. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కనీసం గుంతలు కూడా పూడ్చకపోవటంతో పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుతం మట్టి కొట్టుకుపోయి గుంతలు పెద్దవిగా మారి వర్షపు నీరు నిలిచింది. ఈ రోడ్డును శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.


గుడిపూడి గ్రామం వద్ద గుంతలు

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

(5వ పేజీ తరువాయి)

అందించాలి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా వారికి పని భారం పెరిగి మొత్తంగా వ్యవస్థ దెబ్బతింటోంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కారణంగా ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. ఫలితంగా అంగన్వాడీల నిర్వహణ లక్ష్యాలకు దూరంగా జరిగిపోతోంది.

ఆరు రకాల రికార్డుల మోత

అంగన్వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారి విన్నపాన్ని మన్నించి రికార్డుల భారాన్ని తొలగిస్తూ జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎవరూ ఫిజికల్ రికార్డులు నిర్వహించాల్సిన పనిలేదు. కానీ ఆరు రికార్డులు నిర్వహించాలని అధికారులు హుకూం జారీ చేశారు. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రతి రోజూ గర్భిణీ, బాలింతల రికార్డుతోపాటు ప్రతి నెలా మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డుతో పాటు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా మొత్తం ఆరు రకాల రికార్డులను ఉద్యోగులు నిర్వహించాల్సి వస్తోంది. ఫలితంగా విధుల్లో నాణ్యత తగ్గిపోతోంది. యాప్‌లు నిర్వహించలేమని మొబైల్స్ సెరండర్ చేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. అధికారుల సర్దుబాటుతో ఆ విష యం అంతటితో ఆగింది. తక్షణమే యాప్‌ల నిర్వహ ణకు తగిన ఫోన్లు ఇచ్చి, రికార్డుల నిర్వహణను నిలిపివే యాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పనిభారం తగ్గించి, న్యాయమైన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 1,88,150


కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండను పర్యాటకులు ఆదివారం భారీగా సందర్శించారు. నాగసిరి, శాంతిసిరి,అగస్త్య లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో గల బుద్ధు ని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం సందర్శించారు. అనుపులోని యాంపీ థియేటర్, అశ్వమేధ యజ్ఞశాల, రంగనాథ స్వామి ఆలయం, అనంతరం 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల అందాలను వీక్షించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.1,88,150 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

రామాంజనేయపురంలో పాఠశాల ఏర్పాటు చేయిస్తా

● ఉపాధ్యాయులను కూడా నియమించేలా చూస్తా
● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బెల్లంకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం లోని రామాంజ నేయపురంలో ప్రభుత్వ పాఠశాలను సత్వరమే ఏర్పాటు చేయి స్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వెల్లడించారు. 'చదువు వారికి సాహసమే' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన కథనానికి ఆయన స్పందించారు. రామాంజనేయపురంలో ఎంత మంది విద్యార్థులు ఉంటారు.. వాళ్లు రోజూ పాఠశాలకు వెళ్లేందుకు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు.. అన్న వివరాలను ఎమ్మెల్యే సేకరించిన అనంతరం ప్రకటన చేశారు. అక్కడి విద్యార్థులు అక్కడే చదువుకొనేలా పాఠశాల ఏర్పాటు చేయ డంతో పాటు, అవసరం అయిన ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా అది తన వ్యక్తిగత సమస్యగానే భావిస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ప్రచురితం అయిన కథనం తనను కదిలించిందన్నారు. రామాంజనేయపురంలో విద్యార్థులు ఎదుర్కొంటు న్న సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతిని ఎమ్మెల్యే అభినందించారు.

తుంగభద్రలో యువకుడి గల్లంతు


ప్రశాంత్ (ఫైల్‌ఫొటో)

చుండూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్రలో జారిపడి యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం ఉదయం దుండిపాలెం వద్ద జరిగింది. చుండూరు తహసీల్దార్ దేవరకొండ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిపాలేనికి చెందిన యడ్లపల్లి ప్రశాంత్ (20) ఇంటి సమీపంలో ఉన్న తుంగభద్ర కాలువలో కాళ్లు కడుక్కునే క్రమంలో జారిపడిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, స్థానికులు అధికారు లకు సమాచారం అందించారు. ప్రశాంత్ ఆచూకీ కోసం కాలువ వెంట వివిధ బృందాలు తనిఖీ చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. విషయం తెలుసుకున్న రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీ ఘటనా స్థలానికి చేరుకుని తెనాలి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో ప్రశాంత్ ఆచూకీ కోసం ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేసి కాలువ వెంట గాలింపు చేపట్టారు. సాయంత్రం వరకు ప్రశాంత్ ఆచూకీ లభించలేదని అధికారులు తెలిపారు.

మట్టి పరీక్షలు మమ

(5వ పేజీ తరువాయి)

పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే ఆచరణలో అది అమలుకు నోచుకోలేదు. సాధారణ విస్తీర్ణంలో ఇప్పటికే 50 శాతం పంటల సాగును రైతులు చేపట్టారు. వచ్చే నెలాఖరుకు ఖరీఫ్ సీజన్ కూడా ముగియనున్నది. రబీకైనా సదరు పత్రాలు అందుతాయన్న నమ్మకం రైతులకు కలగడంలేదు.

పరీక్షలతోనే పోషకాల నిర్ధారణ..

పుడమిలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోదుతులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలను అధికారులు అటకెక్కించారు. సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరంగా ఉంది. ఖరీఫ్‌లో సూక్ష్మపోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే రైతులు ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలిరూరల్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి సుల్తానాబాద్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంగలకుదురుకు చెం దిన కిరాణా షాపు నిర్వాహ కుడు పువ్వాడ సుబ్బారావు (72) ఆదివారం తెనాలి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు అతడిని ఢీ కొ ట్టింది. తీవ్రగాయాలతో ఉన్న సుబ్బారావును స్థానికులు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్గ మధ్యలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై త్రీటౌన్ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చందోలు గ్రామంలో వేంచేసి యున్న బగళాముఖి అమ్మవారికి శ్రావణ మాసం ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ జె.వెంకటమురళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజికు వరద నీరు అధికంగా రావడాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైందని, ముందస్తు చర్యలలో భాగంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేశామని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఎస్పీ కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా నదికి వరద నీరు అధికంగా రావటంతో అధికారుల అప్రమత్తత దృష్ట్యా ఈ కార్యక్రమం రద్దు చేసినట్టు తెలిపారు.


ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు తదితర నాయకులు

సంచార జాతుల కోసం స్ఫూర్తి కార్యక్రమం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూడి బంగారుబాబు

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సంచార జాతుల కోసం భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూడి బంగారుబాబు తెలిపారు. పటేల్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన సంచార జాతుల విముక్త జాతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సంచార జాతుల సదాచార వారసులం సంస్కృతుల వారధులం' అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ ఈనెల 30వ తేదీన విజయవాడ వెన్యూవ్ ఫంక్షన్ హాలు వద్ద సంచార సమాజాన్ని స్ఫూర్తిప్రదాతలుగా తెలుపుతూ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపుతో రాష్ట్రంలో సంచార కులాల పెద్దలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు ఈ కార్యక్రమంలోముఖ్యఅతిథులుగా పాల్గొని సంచార కులాల వృత్తులు, కళలు ప్రదర్శించటం, శోభయాత్ర నిర్వహించటమే కాకుండా కళాకారులకు, ఉద్యమనాయకులకు, అవార్డు గ్రహీతలకు సత్కారాలు ఉంటాయన్నారు. అనంతరం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, మాజీ అధ్యక్షుడు వై.లక్ష్మీనారాయణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శులు కొత్రా వెంకటరామకృష్ణ, కాకర్ల శ్రీవేంకటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా పేరిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, కొండారెడ్డి అనీల్‌కుమార్, జీవీఎల్ మోహన్‌గౌడ్, మోర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టి10 టెన్నిస్ క్రికెట్ పోటీలకు ప్రోడిజి విద్యార్థుల ఎంపిక

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బాపట్ల మండలంకు చెందిన ప్రోడిజి విద్యార్థులు టి10 టెన్నిస్ క్రికెట్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రోడిజి విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్‌గో తెలిపారు. ప్రోడిజి విద్యాలయ విద్యార్థులు 9 మంది బాపట్ల జిల్లా టీమ్ తరుపున టీ10 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించారన్నారు. ప్రోడిజి విద్యాలయంకు చెందిన గంగిశెట్టి చైతన్య, డి.రక్షిత్‌విజయవర్మ, టి.జయచంద్‌మణి, పి.ఎస్ఎస్ త్రిచక్రలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఒడిస్సాలోని పూరిలో జరగబోయే ఇండియా టీ10 టెన్నిస్‌బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలకు సెప్టెంబరు 11 నుంచి 14న పోటీలలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ నలుగురు విద్యార్థులను పాఠశాల ప్రాంగణంలో ప్రోడిజి విద్యాలయ కరస్పాండెంట్ మాచబత్తిని శ్రీనివాసరావు, డైరెక్టర్లు చింతకాయల పార్థసారథి, పెదమల్లు ఉదయచంద్రరావు, పీఈటీ శ్రీనివాసరావును, క్రీడాకారులను అభినందించారు.

హైవెండ్ విద్యార్థులకు తృతీయ స్థానం

కర్లపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కర్లపాలెంకు చెందిన హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు టి10 టెన్నిస్‌క్రికెట్‌లో జిల్లా తరుపున పాల్గొని రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారని హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డు సాయిమహేంద్రబాబు తెలిపారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు గ్రామంలో జరిగిన పోటీల్లో పఠాన్ మజూర్‌ఖాన్, పి.వెంకటసాయి, పి.సాయి హర్షవర్ధన్, ఎ.చంద్రశేఖర్, నంగు అరుణ్‌కుమార్‌రెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, జె.హర్షవర్ధన్, కె.సంతోష్, ఎస్.చరణ్‌కుమార్‌రెడ్డి అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. ఈ క్రీడాకారులను హైవెండ్ హైస్కూల్ ఛైర్మన్ ఉదయచంద్రరావు, ఎండీ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్‌లు వెంకటజ్యోతి, చాందిని, ఆంజనేయప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఇటి వీరశేఖర్, రఫీ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


టి10 టెన్నిస్ క్రికెట్ రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం కప్‌ను అందుకుంటున్న నంగు అరుణ్‌కుమార్‌రెడ్డి, టీమ్

చిత్తడి నేలల్లో విస్తారంగా వ్యర్థాలు


సూర్యలంక తీరంలోని చిత్తడి నేలలో వేసిన వ్యర్థాలు

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి మేలు చేసే చిత్తడి నేలలు కలుషితమౌతున్నాయి. సూర్యలంక సముద్రతీరంలోని చిత్తడి నేలల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. ఈ వ్యర్థాలు సముద్రం ఆటుపోటుల సమయంలో లోపలకు వెళ్లి సముద్ర జీవరాశుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. అధికారులు తగు చర్యలు తీసుకొని తీరంలోని చిత్తడి నేలల వద్ద గుట్టలుగా పడి ఉన్న వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలిగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారుల తనిఖీ


బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డులోని జీడీసీ ఎంఎస్ పాయింట్‌లో స్టాక్ రిజిష్టర్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శారద

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా కొరతతో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల వ్యవసాయాధికారి కె.శారద ఆదివారం ఎరువుల దుకాణాలలోని స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డులోని జీడీసీఎం.ఎస్.పాయింట్‌లో మూడు టన్నుల యూరియా, 7.85 టన్నుల డీఏపీ, 20.7 టన్నుల పొటాష్, 10.75 టన్నుల కాంప్లెక్స్, 47.43 టన్నుల సింగిల్ సూపర్ ఫాస్పేట్ అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా మండలంలో 24 ప్రైవేట్ దుకాణాలు ఉండగా వాటిల్లో 12 దుకాణాల్లో స్వల్పంగా యూరియా నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. మండలంలో 17 రైతు సేవా కేంద్రాలు ఉండగా కేవలం కంకటపాలెం రైతు సేవా కేంద్రంలో మాత్రమే యూరియా అందుబాటులో ఉంది. మన గ్రోమోర్ దుకాణంలో, సొసైటీలలో కూడా యూరియా అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి శారద తెలిపారు. ఇంకా అవసరమైన చోట్ల ఇండెంట్ పెట్టటం జరిగిందని ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

చుండూరులో...

చుండూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎరువుల లభ్యతకు ఎలాంటి కొరత లేదని మండల వ్యవసాయాధికారి ఆదాంబాబు ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రైవేటు డీలర్లు, పీఏసీఎస్, జీడీసీఎస్ వద్ద యూరియా 129మెట్రిక్ టన్నులు, డీఏపీ 131, కాంప్లెక్సు 200, నాన్ డీఏపీ 39 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. రైతుల ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్సు కాపీలను సమీపంలోని షాపుల్లో చూపించి ఎరువులు పొందవచ్చునని ఆయన తెలిపారు.

వ్యవసాయశాఖ పరపతి సంఘాలకు డీఏపీ, యూరియా

రేపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరతలేకుండా చూస్తామని వ్యవసాయ శాఖ ఏవో ఎ.మహేష్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో నిల్వలను వ్యవసాయంశాఖాధికారి ఎ.మహేష్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇసుకపల్లి సంఘంలో 40 టన్నుల డీఏపీ, యూరియా 19.8 టన్నులు వచ్చిందని, మార్కెట్ యార్డులో ఉన్న డిస్ట్రిక్ కోఆపరేటివ్ సొసైటీలో 40 టన్నుల డీఏపీ నిల్వ ఉందన్నారు. కైతేపల్లి సొసైటీలో 55 టన్నుల యూరియా, 60 టన్నుల డీఏపీ ఉంది. మండలంలో ప్రైవేటు, సొసైటీలన్నింటిలో కలిపి 378 టన్నుల యూరియా, 220 టన్నుల డీఏపీ కాంప్లెక్స్, 320 టన్నులు ఉందని తెలిపారు. త్వరలో రైతుసేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎమ్మార్పీ ధరలకు ఎరువులు అమ్మాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయశాఖాధికారి ఎండీ ఫారూఖ్

ఎరువులు అధిక ధరలకు అమ్మరాదు : ఎంఏవో

పిట్టలవానిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో డీలర్‌లు ఎరువులు అధిక ధరలకు అమ్మినా, స్టాక్ లేదని రైతులకు చెప్పినా అలాంటి షాప్‌ల డీలర్‌లపై చట్ట రీత్య చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ తెలిపారు. మండలంలో ఆదివారం వివిధ దుకాణాలలో ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఎంఏవో సత్యానంద్ మాట్లాడుతూ ఇప్పటికే వివిధ ఎరువుల దుకాణాలలో డీఏపీ 122 టన్నులు, ఎంవోపీ 55 టన్నులు, ఎన్‌పీకే 260 టన్నులు, ఎస్ఎస్‌పి 100 టన్నులు, యూరియా 310 టన్నులు, మండలంలోని ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చందోలులోని సాయిజిష్ణు షాపునకు సంబంధించి ఎరువులు ఉన్న స్టాక్ దుకాణాన్ని ఎంఏవో సత్యానంద్ పరిశీలించారు.


చందోలులోని స్టాక్ ఉన్న ఎరువులు పరిశీలిస్తున్న ఎంఏవో సీహెచ్ సత్యానంద్


బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఉచిత బస్సులలో విస్తృతంగా ప్రయాణం

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించటంతో పెద్దఎత్తున మహిళలు ఆర్టీసీ ప్రయాణం చేస్తున్నారు. బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో ఆదివారం బస్సుల కోసం పెద్ద ఎత్తున మహిళలు వచ్చారు. వరుసగా మూడురోజులు సెలవులు రావటంతో వివిధ ప్రాంతాలలో ఉద్యోగరీత్య, చదువుల కొరకు వెళ్ళిన వారు స్వగ్రామానికి వచ్చి ఆదివారం తిరిగి ప్రయాణం చేశారు. ఈ నేపథ్యంలో బాపట్ల పాతబస్టాండ్ కూడలి ప్రయాణికులతో కిక్కిరిసింది. ఉచిత బస్సులలో ప్రయాణించేందుకు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. మహిళలతోపాటు వారి భర్తలు, పిల్లలు కూడా ఆర్టీసీ ప్రయాణం వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఇవ్వకండి

● ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట సహాయ కార్యదర్శి వలి

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఇవ్వకండని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీటీ వలి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై ఆదివారం ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ స్థలాన్ని లులు షాపింగ్‌మాల్‌కు కేటాయిస్తూ జారీ చేసిన జీవో నెంబరు 137ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న గవర్నర్‌పేట డిపోలు, పాతబస్టాండ్‌లకు చెందిన 4 ఎకరాల స్థలం సుమారు రూ.400 కోట్ల విలువ చేస్తుందన్నారు. ఆ స్థలాన్ని లులు షాపింగ్ మాల్‌కు అప్పగించటం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ కార్యదర్శి వై.ఎస్.రావు, జిల్లా కార్యదర్శి పి.కమలాకరరావు, నెల్లూరు జోనల్ మహిళా నాయకురాలు పి.రజనీ, ఎంపీకుమార్, టి.చంద్రశేఖర్, వైఎన్.రావు, ఐఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కూడో క్రీడాపోటీలు


ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తున్న తాండ్ర సాంబశివరావు

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ ఆడిటోరియంలో జరుగుతున్న జిల్లా స్థాయి కూడో ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర కూడో అసోసియేషన్ అధ్యక్షుడు ఆలూరి శశిధర్, సెక్రటరి రవిబాబు, కోశాధికారి అనురాధ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీలకు వైజాగ్ నుంచి రాష్ట్ర కూడో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమణ పరిశీలకునిగా విచ్చేశారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు బాలరామకోటిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడే కిషోర్, జిల్లా కార్యదర్శి తేజ, మాజీ సైనిక సంక్షేమ సంఘం బాపట్ల అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, కార్యదర్శి షేక్ మొహిద్దీన్, శంకర శేషగిరిరావు, టి.రుక్మధరావు, అడే రాఘవదేవి, అమ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కూడో శిక్షకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమృతలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న 15 రోజుల వరకు రాష్ట్రంలో తుఫాన్, భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు తెలిపారు. కాలువలు, చెరువులు, కుంటలు వర్షపు నీటితో నిండి ఉన్నందున ప్రజలు ఎవరూ వాటిలో దిగరాదన్నారు. రైతులు, ప్రజలు తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకరికి మరొకరు సహకరించుకోవడంతో మెరుగైన సమాజాన్ని రూపొందించవచ్చునని చంద్రపాటి రామనారాయణ అన్నారు. ప్రాణిక్ హీలింగ్, అర్హ యోగా గ్రాండ్ మాస్టర్ చోవాకోక్‌సుయ్ జయంతోత్సవాలలో భాగంగా ఆదివారం గంగపుత్ర కాలనీలోని 80 మంది మహిళలకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేలో ప్రపంచ స్థాయి గ్రాండ్ మాస్టర్ స్థానంలో నిలిచిన చోవాకోక్‌సుయ్ నమ్మిన సిద్ధాంతంతో హీలింగ్ పవర్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జి అధ్యక్షుడు బాపట్ల రవికుమార్, జె.విశ్వనాథ్, జగదీష్, బాలాజి, తెల్లమేకల యశ్వంత్, షాలేంరాజు, వి.వెంకటేశ్వర్లు, గొల్ల సత్యం, మారం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే సేవలు స్ఫూర్తిదాయకం : సీఐ

బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం బాపట్లలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ ఆర్.రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, బెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు సురేష్, గొర్ల శ్రీనివాసరావు, గణేష్, ఉప్పాల శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, నరసింహారావు, వెంకట్, చంటి, జంగం దాసు, సురేష్, చప్పిడి వెంకట్రావు, కరీం, గోపి, దుర్గాప్రసాద్, చేజర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

కర్లపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం రాధాకృష్ణనగర్‌లో శ్రీకృష్ణాష్టమి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని ఏకనామం, ప్రత్యేక పూజలు, ఉట్టికొట్టే కార్యక్రమం, మూడు వేల మందికి అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మర్రి ఆశా అశోక్ చక్రవర్తి, పెద్దలు నర్రావుల పున్నయ్య, బ్రహ్మయ్య, నర్రా శ్రీనివాసరావు, తోట వెంకటేశ్వర్లు, నల్లబోయిన శ్రీనివాసరావు, లీలా గోపికృష్ణ, తోట ఏసురాజు పాల్గొన్నారు.

చినపులివర్రులో...


శ్రీకృష్ణ తత్వాన్ని వివరిస్తున్న ధర్మప్రచారక్ హేమశంకరరావు

కొల్లూరు ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని చినపులివర్రు కోదండ రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణునికి పవళింపు సేవ, భజన సంకీర్తనలు, సత్సంగం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు భక్తులకు శ్రీకృష్ణ తత్వాన్ని బోధించారు. ఈ కార్యక్రమంలో మందలపు రాజకుమారి, మాధవి, అనసూయ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

కర్లపాలెం ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మానవ దేహంలో నేత్రాలు ప్రధానమైనవని సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పెనుమెత్స సత్యనారాయణరాజు అన్నారు. కర్లపాలెం శ్రీపెద్దింటమ్మ దేవాలయంలో పెదకాకాని శంకర్ కంటి హాస్పటల్, జిల్లా అంధత్వ నివారణ ట్రస్ట్ వారు ఆదివారం ఉచితనేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 200 మంది ఉచిత నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వారిలో సుమారు 70మందికి ఉచిత కంటి ఆపరేషన్‌లు ఈనెల 22న చేస్తామని శంకర్ హాస్పటల్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో శంకర కంటి హాస్పిటల్ డాక్టర్‌లు శ్వేత, నసీమా, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పెనుమెత్స లక్ష్మీనరసరాజు, తుమ్మల శ్రీనివాసరావు, బొమ్మనబోయిన సాంబయ్య, కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పోలీసురావు, ఎం.శ్రీనివాస్, రెడ్డి పాల్గొన్నారు.

గ్రామదేవతలకు సారె సమర్పణ

చెరుకుపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నడింపల్లి గ్రామంలోని గ్రామదేవతలు అంకాళమ్మ, రెడంకమ్మలకు శ్రావణ మాసం సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు.


బేతపూడిలో సచివాలయశిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అనగాని శివప్రసాద్,అధికారులు

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

రేపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించటమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని బేతపూడిలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రూ.40లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామప్రజలు కార్యాలయం చుట్టూ తిరగకుండా ఏ పని కోసం వచ్చినా రెండు,మూడు రోజుల్లోనే పరిష్కరించే విధంగా అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, సర్పంచ్ ఆలూరి పద్మ, ఎంపీటీసీ పరుచూరి సరిత, టీడీపీ నాయకులు కుడితిపూడి నరసింహారావు, మాజీ ఎంపీపీ కారుమూరు జ్యోతి, వీరయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి : అనగాని

రేపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని బేతపూడిలో ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకటఅప్పలచార్యుల ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబ చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం మహాసంప్రోక్షణసహిత జీవధ్వజ నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వేదపండితులు కొమ్మూరి ఫణిశర్మ, రావూరి నరేష్‌శర్మ, ఎం.శ్రీనివాస్‌శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు శివప్రసాద్, ఆలయ అభివృద్ధి పనులకు సంధానకర్త కుడితపూడి నరసింహారావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూనుకున్న నరసింహారావు దేవదాయ శాఖాధికారులకు, గ్రామస్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు రైతులకు వ్యవసాయ రుణాల చెక్కుల పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయ రుణాలను పంపిణీ చేయనున్నట్లు భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. మండల కేంద్రం భట్టిప్రోలులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సోమవారం 85 మంది రైతులకు ఐదు కోట్ల ముప్పది ఒక లక్షల వ్యవసాయ రుణాలను అందించనుంది. ఆయా రుణాలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, గుంటూరు జిల్లా జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● కూచినపూడి మార్కెట్ యార్డు ఛైర్మన్ ఓగిబోయిన

రేపల్లె, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు సమృద్ధిగా అందించి వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కూచినపూడి మార్కెట్ యార్డు ఛైర్మన్ ఓగిబోయిన వెంకట్‌యాదవ్ అన్నారు. కూచినపూడి సొసైటీ బ్యాంకు ఆధ్వర్యంలో రైతుల సౌలభ్యం కోసం అడవులదీవిలో ఎరువుల గోడౌన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు సమృద్ధిగా అందించేందుకు మంత్రి అనగాని ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ఈ కార్యక్రమంలో కూచినపూడిసొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, కేసన పమిడియ్య, కూచిపూడి మోహన్‌రావు, మేకా రాజేష్, మోర్ల రామ్‌ప్రసాద్, నల్లపాటి యల్లయ్య, కేసన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ పద్మ అంకాళమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ


జంపనిలో ప్రతిష్ఠించిన శ్రీపద్మ అంకాళమ్మ తల్లి దేవర విగ్రహం

వేమూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో చక్రధార కుటుంబీకుల (కుమ్మరులు)దేవరగా పూజలందుకుంటున్న శ్రీ పద్మ అంకాళమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పూర్వకాలం నుంచి దేవర ప్రతిరూపాన్ని పెద్దలు నిర్మించిన మందిరంలో ఉంచి పూజలు చేస్తున్నారు. కుటుంబీకులంతా ఆలయాన్ని పునర్నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నారు. దాత గుమ్మడిదల శ్రీనివాసరావు దంపతులు విగ్రహ సమర్పణకు, ఆలయ నిర్మాణానికి భూరి విరాళం అందించారు. మరి కొందరు దాతల సహాయ సహకారాలతో ఆలయ వాస్తు ప్రకారం నిర్మాణాన్ని పూర్తి చేశారు. శైవ ఆగమ పండితులు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి వెంకట సుబ్బరాయ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాశాంతి హోమ క్రతువులో 108 మంది దంపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల నుంచిచక్రధార కుటుంబీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండలంలో ఎరువుల కొరత లేదు

● మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్‌భరత్‌కుమార్

అమృతలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సహకార సంఘాలు, డీలర్ల వద్ద ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు సహకార సంఘాలు, ప్రైవేటు దుకాణాల ద్వారా 1400 మెట్రిక్ టన్నులు యూరియా, 750 టన్నుల డీఏపీ రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 120 మెట్రిక్ టన్నుల యూరియా, 143 మెట్రిక్ టన్నుల డీఏపీ, 240 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటికి తోడు మంగళవారం నాటికి మరింత యూరియా, డీఏపీ అందుబాటులో ఉంటుందని రైతులు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు.

రైతులు అవసరమైన మేరకే ఎరువులను తీసుకోవాలి

చెరుకుపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువుల దుకాణాలలో మండల వ్యవసాయశాఖాధికారి ఎండీ ఫారూఖ్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికి 9400 ఎకరాలలో వరి సాగు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కావూరు పీఏసీఎస్‌లో 40 టన్నులు, పొన్నపల్లిలో 60 టన్నులు, ఎరువుల రిటైలర్ డీలర్ల దగ్గర 90 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పంట నాటిన రైతులు అవసరమైన మేరకే ఎరువులను తీసుకోవాలని కోరారు.

యూరియాకు ఎటువంటి కొరతలేదు : ఏవో

కర్లపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్ కింద 9624 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయటం జరిగిందని, యూరియాకు ఎటువంటి కొరతలేదని మండల వ్యవసాయాధికారి సుమంత్ కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ మండలంలో 59,605 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మంగళవారానికి అన్ని రైతు సేవా కేంద్రాల్లో మళ్ళీ పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు.

వైసీపీ ఆర్టీయూసీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏడుకొండలు

వేమూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆర్టీయూసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వేమూరు నియోజకవర్గానికి చెందిన బొల్లిముంత ఏడుకొండలు నియమితులయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం ఏడుకొండలు నియామకాన్ని ప్రకటించారు. ఏడుకొండలకు పదవి రావడం పట్ల వైఎస్ఆర్ పార్టీ అభిమానులు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు తన నియామకాన్ని కృషి చేసిన పార్టీ ఇన్‌చార్జి అశోక్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అవీ.. ఇవీ


ఏబీసీ వంతెన వద్ద ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న డైవర్షన్ రోడ్డు

ఏబీసీ వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు తొలగింపు

● రాకపోకలు లేక వాహనదారుల ఆగ్రహం

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కాలువపై వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. చిన్న చిన్న వాహనాలు వెళ్లేలా డైవర్షన్ రోడ్డును పనుల వద్ద ఏర్పాటు చేశారు. దీంతో బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆదివారం ప్రజలకు ఎలాంటి సమాచారం తెలియజేయకుండానే డైవర్షన్ వేసిన రోడ్డును తొలగించారు. దీంతో రోజు మాదిరిగా ఈ రోడ్డులో వచ్చిన ప్రజలు రోడ్డు లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో వచ్చే కొత్త వ్యక్తులు వంతెన వద్దకు వచ్చి తిరిగి వెనక్కి వెళ్లాల్సి వచ్చిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆదివారం పలు శుభకార్యాలు ఉండటంతో ప్రజలు ఏబీసీ వంతెన వద్దకు వచ్చి రాకపోకలు లేకపోవటంతో ఉసూరుమంటూ వెళ్లారు.


అద్దంకి పట్టణం నాగులపాడు రోడ్డులోని ఓ వీధిలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

వీధి శునకాలతో ప్రజల బెంబేలు

అద్దంకి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో వీధి శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై ఎగబడుతున్నాయి. దీంతో వీధులలో వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తె పరిస్థితి నెలకొంది. వీధి కుక్కల నియంత్రణ పై మున్సిపల్ అధికారులు మొక్కుబడి చర్యలు మాత్రమే తీసుకుంటుండటంతో అవి మరింత పెరిగి పోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. సంతానోత్పత్తి లేకుండా ఆపరేషన్‌లు చేయించే విధంగా చర్యలు చేపట్టే అవకాశం ఉన్నా మొక్కుబడిగా మాత్రమే చర్యలు చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో వీధిలో పదుల సంఖ్యలో వీధి కుక్కలు ఉండటంతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో మరింత భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు

పంగులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చిలుకూరివారి వంశదేవర శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం పంగులూరులో వైభవంగా జరిగింది. తెనాలికి చెందిన ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ వేములశ్రీహరి పర్యవేక్షణలో వారి రుత్విక్‌ల బృందం నిర్ణీత ముహూర్తంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ గావించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారు సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్న నూతన ఆలయంలో కొలువుదీరారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనేందుకు పంగులూరు,చినమల్లవరం, నక్కలపాలెం, నాగండ్ల, ఇంకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన చిలుకూరి వంశస్థులు, వారి ఆడపడుచులు, బంధుమిత్రులు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. దాతలు సమకూర్చిన వెండికిరీటధారణలతో ప్రత్యేకాలంకరణలో శోభిల్లిన శ్రీభద్రకాళీ అమ్మవారిని, వీరభద్రస్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. దేవతామూర్తుల ప్రతిష్ఠాపన అనంతరం శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కన్నుల పండువగా జరిగిన స్వామి వారి శాంతి కల్యాణవేడుకలో చిలుకూరి వంశస్థులు సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు.


ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి

వేలాదిమందికి అన్నదానం

పంగులూరులో ఆదివారం జరిగిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటుచేసింది.

పాల్గొన్న మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గరటయ్య

చిలుకూరివారి వంశదేవర శ్రీభద్రకాళీసమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గరటయ్య, బాచిన చెంచు ప్రసాద్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


పోతురాజు శిల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆలయశిఖరంపై కలశప్రతిష్ఠ చేస్తున్న వేదపండితులు

ప్రయాణికులు ఫుల్ బస్‌లు నిల్..!

● ఆదివారం రోజూ తీవ్ర రద్దీ

అద్దంకి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ బాగా పెరిగింది. అయితే అందుకు తగ్గట్లు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు లేకపోవటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పటం లేదు. ఆదివారం రోజు కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది.దీంతో సోమవారం నుంచి పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళన ప్రయాణికులలో నెలకొంది. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి అరకొర బస్సు సర్వీసులు మాత్రమే ఉండటంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఆదివారం వివాహాలు ఉండటంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించారు. ప్రధాన రూట్లలో సైతం బస్సులు సరిపడా లేకపోవటం తో ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు కుస్తీలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయటంతో రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు ఆర్టీసీ అధికారులు బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో నర్సరావుపేట బస్సు ఎక్కేందుకు గుమికూడిన ప్రయాణికులు


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

శివాలయానికి శ్రీచక్రం బహూకరణ

ఇంకొల్లు,ఆగస్టు 17,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పాలేరు రామకృష్ణ దంపతులు శ్రీగంగాపార్వతి సమేత చెన్నమల్లేశ్వర స్వామి వారి ఆలయానికి పంచలోహాలతో తయారు చేసిన శ్రీచక్రంను బహూకరించారు. ఆదివారం ఆలయప్రాంగణంలో శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చరణల మధ్య పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. కావలికి చెందిన వేదపండితులు కొండ కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్ర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయపూజారి సాంబశివరావు, దాత కుటుంబీకులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న రామకృష్ణ దంపతులు


నరసింహారావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు

నరసింహారావుకి టీడీపీ నేతల నివాళి

చినగంజాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు తండ్రి నరసింహారావు ఆదివారం మృతి చెందాడు. పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీనివాసరావు స్వగృహానికి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు కొమ్మినేని వెంకట్, బి.అఖిల్, టీడీ పీ నాయకులు సాంబయ్య, వల్లేరు మార్క్, వెంకటేశ్వర్లు, శివయ్య, అద్దూరి వెంకటేశ్వర్లు, రాచూరి కుమార్, దేవతోటి నాగరాజు, టి.చిన్నాలు నరసింహారావు పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావుని ఎమ్మెల్యే ఏలూరి ఫోన్లో పరామర్శించారు.

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

(5వ పేజీ తరువాయి)

అందించాలి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా వారికి పనిభారం పెరిగి మొత్తంగా వ్యవస్థ దెబ్బ తింటోంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కారణంగా ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించ లేకపోతున్నారు.

ఆరు రకాల రికార్డుల మోత

అంగన్వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారి విన్నపాన్ని మన్నించి రికార్డుల భారాన్ని తొలగిస్తూ జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎవరూ ఫిజికల్ రికార్డులు నిర్వహించాల్సిన పనిలేదు. కానీ ఆరు రికార్డులు నిర్వహించాలని అధికారులు హుకుం జారీ చేశారు. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రతి రోజూ గర్భిణి, బాలింతల రికార్డుతో పాటు ప్రతి నెలా మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డుతో పాటు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా మొత్తం ఆరు రకాల రికార్డులను ఉద్యోగులు నిర్వహించాల్సి వస్తోంది. ఫలితంగా విధుల్లో నాణ్యత తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో యాప్‌లు నిర్వహించలేమని మొబైల్స్ సరెండర్ చేసి ఉద్యోగులు నిరసన తెలి పారు. అధికారుల సర్దుబాటుతో ఆ విషయం అంతటితో ఆగింది. తక్షణ మే యాప్‌ల నిర్వహణకు తగిన ఫోన్లు ఇచ్చి, రికార్డుల నిర్వహణను నిలిపివేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు పొంగళ్లు

పంగులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):శ్రావణ మాసం సందర్భంగా కొండమూరు, మప్పవరం గ్రామాలలో మహిళలు గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. ఆదివారం గ్రామంలోని మహిళలు గ్రామదేవతలైన పోలేరమ్మ, పోతురాజులకు మొక్కులు చెల్లించుకునే కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పొంగళ్ళు సమర్పించి పూజలు చేశారు.

కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నర్సారావుపేట ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఈనెల 21 వ తేదీన పల్లకి ఊరేగింపు కార్యక్రమంతో ముగింపు కార్యక్రమం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. మెదటి రోజు మహిళా భక్తులు పూజా కార్యక్రమాలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

పర్చూరు, అగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో పర్చూరులోని ఎన్టీఆర్ క్రీడా వికాస స్టేడియంలో నిర్వహించిన మెన్స్ డబుల్ షటిల్ టోర్నమెంట్ పోటీలో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈపోటీలో ప్రథమ బహుమతి ప్రకాశం జిల్లా మార్కాపురం కైవసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులు చీరాల, చినగంజాం, ఇంకొల్లు కైవసం చేసుకున్నాయి. ప్రథమ బహుమతి రూ.10 వేల రూపాయలను తెలుగుదేశం పార్టీ యువనేత చెరుకూరి చింపయ్య(శ్రీధర్) అందజేశారు.

పీఏసీఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారం

కారంచేడు మండలం కొడవలివారిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్, డైరెక్టర్లుగా కొసరాజు సునీల్, కొడలి శ్రీనివాస్, నల్లూరి శ్రీనివాసరావులు ఆదివారం కొత్తగొర్ల శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


విద్యార్థులతో పీ-4 మార్గదర్శి విక్రం నారాయణరావు

పేద విద్యార్థులతో పీ4 తొలి మార్గదర్శి మమేకం

● వారితో కలిసి సహపంక్తి భోజనం

చినగంజాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థులతో పీ-4 మొదటి మార్గదర్శి, లాయిడ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ విక్రం నారాయణరావు ఆదివారం మమేకయ్యారు. గొనసపూడి గ్రామంలోని తన స్వగృహానికి విద్యార్థులను పిలిపించుకొని వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామం వచ్చిన సందర్భంగా రాష్ట్రంలోని మొట్టమొదటి మార్గదర్శిగా విక్రం నారాయణరావుని ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి సమక్షంలోనే ఆయన గ్రామంలోని 15 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న 15 కుటుంబాలలో ఉన్న ఆరుగురు విద్యార్థులు ఎల్లావుల గణేష్, మద్దిన నాగార్జున, కిలారి దివ్య, ఎల్లావుల సుధీర్, ఎల్లావుల ప్రభాకర్, గోనె హేమలతలతో ఆయన మాట్లాడారు. వారి యోగక్షేమాలతోపాటు వారు ఏ తరగతి చదువుతున్నది, ఏ పాఠశాలలో చదువుతున్నారు, విద్యా విధానం, కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల పాఠశాల ఫీజులు ఆయనే చెల్లిస్తున్నారు. ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, దివ్వకోలు రాము, వెంకటరావు, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కే శారద తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో గుర్తింపు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణిస్తున్న యువత ఆధారంగా ఆయా ప్రాంతాల కీర్తి ప్రసిద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే కొండయ్య బహుమతులు అందజేశారు. అలాగే పందిళ్లపల్లి గ్రామంలోని పందిళ్లమ్మతల్లి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మ ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ లైన్లతో సరఫరాకు అంతరాయం

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయిదు రోజుల పాటు ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు చేస్తున్నామని, దీని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం నుంచి నూతన విద్యుత్ లైన్ పనులు ప్రారంభం అయ్యాయని, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.


బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

జర్నలిస్టులకు ప్రజా ప్రభుత్వం అండ

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, సమస్యలు ఎత్తి చూపి ప్రజల పక్షాన నిలిచేది పాత్రికేయులేనని ఏపీయూడబ్ల్యూజే 69వ వార్షికోత్సం ఆదివారం చీరాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏరియా వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. అనంతరం చైతన్య మనో వికాస కేంద్రంలో మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొండయ్య, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు హాజరయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, పాత్రికేయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

● సాగులో అప్పులే కారణమని చెబుతున్న కుటుంబసభ్యులు

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన యువకుడు కాకాని ఈస్టర్ బాబు (27) ఆదివారం చెట్టు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అందిన సమాచారం ప్రకారం బల్లికురవ మండలం వేమవరంలోని ఒక గ్రానైట్ పరిశ్రమలో ఈస్టర్‌బాబు సూపర్ వైజరుగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది వేమవరంలో 7, గన్నవరంలో 3 ఎకరాలను కౌలుకు తీసుకొని బర్లీ పొగాకును సాగు చేశాడు. పండించిన పొగాకులో కొంతభాగాన్ని అమ్ముకోగా, ఇంకా కొంత అమ్ముకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దాదాపుగా రూ. 7 లక్షలకు పైగా బాకీలు ఉన్నాయి. దీంతో అప్పులు తీర్చలేననే మనస్తాపంతో ఈస్టర్‌బాబు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఆత్మహత్యపై పూర్తి స్థాయిలో సమాచారం అందలేదని, గ్రామ వీఆర్వోను సమాచారం సేకరించాలని ఆదేశించినట్లు మండల తహసీల్దారు కె. రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ టి. రత్నకుమారి తెలిపారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబసభ్యులను టీడీపీ మండల నాయకులు నల్లపనేని రంగయ్యచౌదరి పరామర్శించారు.